క్లుప్తంగా

ఏకలవ్యుడికి ఘన నివాళి



కంచికచర్ల : స్థానిక ఇందిరాకాలనీలో ఏకలవ్యుడి జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఏకలవ్యుడి విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్‌చేశారు. ఈమేరకు వేమా వైఎస్సార్ సీపీ కంచికచర్ల పట్టణ కన్వీనర్ వేమా సురేష్‌బాబు మాట్లాడుతూ విల్లు విద్యలో ఎంతోగొప్ప ప్రావీణ్యం సంపాదించిన ఏకలవ్యుడిని ఆదర్శంగా తీసుకుని, అందరూ వారి వారి రంగాల్లో అభివృద్ధిని సాధించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కావాటి ఉషారాణి, కావాటి రాంబాబు, మేచర్ల రాజా వంశీ, కట్టా తిరుపతిరావు, కట్టా బాబు, కావాటి ఆదినారాయణ, మేచర్ల దుర్గాప్రసాద్, తిమ్మసర్తి విజయ్, పొన్నపల్లి శ్రీనివాసరావు, దేవిరెడ్డి శ్రీనివాసరావు, ఆకుల రామారావు, దేవిరెడ్డి లక్ష్మీనారాయణ, బుచ్చిబాబు, మండల శివ, చందు, తదితరులు పాల్గొన్నారు.

రేపు వీరులపాడు మండల పరిషత్ సమావేశం

వీరులపాడు: జుజ్జూరులోని కమ్యూనిటీ హాలులో శుక్రవారం మధ్నాహ్నం ర రెండు గంటలకు వీరులపాడు మండల పరిషత్ సర్వ సభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.శివపార్వతి బుధవారం తెలిపారు. సమావేశానికి నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య హాజరవుతున్నారు. మండలంలోని జెడ్పీటీసీ సభ్యురాలితోపాటు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు, సొసైటీ అధ్యక్షులు తప్పనిసరిగా సమావేశానికి హాజరుకావాలని ఎంపీడీవో కోరారు. అధికారులు ఆయాశాఖలకు సంబంధించిన నివేదికలను గురువారం సాయంత్రంలోగా మండల పరిషత్ కార్యాలయంలో అందజేయాలని ఎంపీడీవో సూచించారు.

విభిన్న ప్రతిభావంతులకు కళ్లజోళ్ల పంపిణీ



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మొహరం పండుగ సందర్భంగా విభిన్న ప్రతిభావంతులకు ఉచితంగా కళ్లజోళ్లు అందజేసినట్లు అబ్దుల్ కలాం విభిన్న ప్రతిభావంతుల అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీ ఆయూబ్ ఖాన్ చెప్పారు. వన్‌టౌన్‌లోని రాయల్ ఆర్టికల్స్ ప్రాంగణంలో బుధవారం సాయంత్రం వంద మంది విభిన్న ప్రతిభావంతులకు ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయూబ్ ఖాన్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల సమస్యల పరిష్కారానికి తమ సంఘం తరఫున కృషి చేస్తున్నట్లు వివరించారు. ఎన్టీఆర్ జిల్లాలో దాదాపు 15 వేల మంది విభిన్న ప్రతిభావంతులు ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ నేత్ర వైద్యుడు డాక్టర్ రావెళ్ల రాజకుమార్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు, నిరుపేదలకు అబ్దుల్ కలాం అసోసియేషన్ తరఫున అందజేస్తున్న సేవలను ప్రశంసించారు. తమ వంతు సహకారం అందజేస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో షఫీ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే కార్మికుని కుటుంబానికి ఆర్థిక సాయం

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ఈ ఏడాది మే 5న విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మృతిచెందిన రైల్వే కార్మికుని కుటుంబానికి రైల్వే మజ్దూర్ యూనియన్ ఆర్థిక సాయం అందజేసింది. ఈమేరకు దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్, విజయవాడ డివిజన్‌ల కార్యదర్శులు పి.రవీందర్, లీల బుధవారం మృతుని కుటుంబ సభ్యులకు రూ.1.50 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజయవాడ డివిజన్‌లో విధులు నిర్వర్తిస్తూ చిన్న వయస్సులోనే రైలు ప్రమాదంలో మృతిచెందటం దురదృష్టకమన్నారు. రైల్వేశాఖ తరఫున మృతుని కుటుంబానికి రావాల్సిన నష్టపరిహారం, ఉద్యోగం కోసం దక్షిణ మధ్య రైల్వే జీఎం, డీఆర్ఎంలను సంప్రదించి వారికి న్యాయం చేసేందుకు కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు హామీ ఇచ్చారు.

నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పించాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో వివిధ డిపార్ట్‌మెంట్లలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, చిన్న తరహా పరిశ్రమలను ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని భారత ఐక్య యువజన సమాఖ్య (యువైఎఫ్ఐ) రాష్ట్ర కన్వీనర్ కాసాని గణేష్ బాబు డిమాండ్ చేశారు. విజయవాడ వించిపేటలోని సంఘ కార్యాలయంలో సంస్థ నగర కన్వీనర్ అనకాపల్లి కనకరాజు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువతను నిర్లక్ష్యం చేయడం తగదని కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. వ్యవసాయ రంగ అనుబంధ పరిశ్రమలు, పశువుల పెంపకం, పౌల్ట్రీ, డెయిరీలలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించేలా ప్రోత్సహించాలని డిమాండ్ చేశారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి

పెనుగంచిప్రోలు: తొలి ఏకాదశిని పురస్కరించుకుని భక్తులు బుధవారం ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని ఆలయాలన్నీ భక్తులతో కళకళలాడాయి. పెనుగంచిప్రోలులో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారికి ప్రత్యేక అలంకరణతో పాటు పూజలు చేశారు. అలాగే గ్రామంలోని పలు ఆలయాలతోపాటు మండలంలోని ఆలయాల్లో భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారు, అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు.

నందిగామ పట్టణంలో..

కంచికచర్ల : తొలిఏకాదశిని పురస్కరించుకుని నందిగామ పట్టణంలోని లలితా విష్ణు వాసవి జ్ఞాన వాహిని మహిళా మండలి సభ్యులు బుధవారం వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి సారెను సమర్పించారు. మహిళలు, భక్తులు మేళతాళాలు, మంగళవాయిద్యాలతో పురవీధులో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సారె సమర్పించి పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యకు పసుపు కుంకుమలు ఇచ్చి సారెను అందజేసి శాలువాతో సత్కరించారు. భక్తులు పాల్గొన్నారు.

కంచికచర్లలో...

స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారికి తొలి ఏకాదశి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మహా విష్ణుకు ప్రీతికరమైన పేలాల పిండిని స్వామి వారికి నైవేద్యం పెట్టారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు.

వేదాద్రిలో..

వేదాద్రి(జగ్గయ్యపేట): తొలి ఏకాదశి సందర్భంగా వేదాద్రిలో వేంచేసియున్న యోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయం బుధవారం కిటకిటలాడింది. ఆలయ సమీపంలోని కృష్ణనదిలో పవిత్రస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. తెల్లవారుజాము నుంచే పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులకు స్వామివారి దర్శనానికి రెండుగంటలకు పైగా సమయం పట్టింది. ఆలయ ఈవో హేమలతా దేవి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్వామివారిని కృష్ణ మిల్క్ యూనియన్ అధ్యక్షులు చలసాని ఆంజనేయులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గుంటూరుకు చెందిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి సేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఈవో ప్రారంభించారు. ఏకాదశి సందర్భంగా దర్శన టిక్కెట్లు, లడ్డు ప్రసాదాల విక్రయాలతోపాటు అన్నదాన విరాళాల ద్వారా ఆలయానికి రూ.1,45,165లక్షల ఆదాయం వచ్చిందని ఈవో తెలిపారు.

చీరల వేలం ద్వారా రూ.50,460...

ఆలయ ప్రాంగణలో స్వామివారు, అమ్మవార్లకు భక్తులు సమర్పించిన చీరలు, ధోవతీల వేలం ద్వారా ఆలయానికి రూ.50,460 ఆదాయం లభించింది. దేవాలయ ఇన్‌స్పెక్టర్ ఫణికుమార్, ఈవో హేమలతా దేవి సమక్షంలో ఆలయంలో వేలం నిర్వహించారు.

జగ్గయ్యపేట పట్టణంలో..

జగ్గయ్యపేట అర్బన్: తొలి ఏకాదశిని పండుగను జగ్గయ్యపేట పట్టణ ప్రజలకు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వేకువ జామునే ఆలయాలకు తరలి వచ్చిన భక్తులు స్వామి వార్లను దర్శించుకొని ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. స్థానిక చెన్నకేశవ స్వామి ఆలయంలో పంచామృతాభిషేకాలు నిర్వహించగా, భగవత్ రామానుజా గోష్ఠి బృందం పాలు, తేనె, పండ్ల రసాలు, పుష్పాలు, తులసీమాలలతో స్వామివార్లకు పూజలు చేశారు. శ్రీఆనందసాయి ఆలయంలో శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, శ్రీమద్భగవద్గీత పారాయణాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు సాయినాధుని దర్శించుకుని పూజలు చేశారు. విజయవాడ రోడ్డులోని శ్రీరుక్మిణి సత్యభామ సమేత సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో లక్ష తులసీ అర్చన, బలుసుపాడు రోడ్‌లోని పాత వెంకటేశ్వరస్వామి ఆలయం, శ్రీరంగనాయక స్వామి ఆలయాలలో విశేష పూజలు నిర్వహించారు.



పెనుగంచిప్రోలులో ప్రత్యేకాలంకరణలో శ్రీగోపయ్యసమేత తిరుపతమ్మవారు



పేట శ్రీసంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు



వేదాద్రిలో అన్నదానంలో పాల్గొన్న భక్తులు



అమ్మవారికి సారెను తీసుకెళ్తున్న భక్తులు



విష్ణుసహస్రనామ పారాయణం చేస్తున్న భక్తులు

త్యాగాలకు ప్రతీక మొహర్రం



పేట లాల్‌సా పీర్ల పంజా వద్ద ప్రత్యేకాలంకరణలో సవారీ



నందిగామలో పీర్ల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, ముస్లిం పెద్దలు

జగ్గయ్యపేట అర్బన్ : త్యాగాలకు ప్రతీక అయిన మొహర్రంను జగ్గయ్యపేట పట్టణంలోని ముస్లిం సోదరులు బుధవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తమ గృహాల్లో ప్రార్థనలు, ఉపవాస దీక్షలు చేశారు. మొహర్రం నేపథ్యంలో మంగళవారం రాత్రి పట్టణంలోని పలు పీర్లచావిడీల వద్ద పీర్లను ఊరేగించారు. స్థానిక పాత కూరగాలయ మార్కెట్ వీధిలోని లాల్‌సా పీర్ల పంజాలో సవారీ అందరినీ ఆకట్టుకుంది. శివాలయం వీధిలో ఉన్న పీర్లచావిడి నుండి సవారీలను ముస్లిం యువకులు పలు వీధులలో ఊరేగించి ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పీర్లు చేతపట్టిన యువకులు పీర్ల చావిడి వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక అగ్నిగుండంలో నడిచారు. యువకులు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలులో..

పెనుగంచిప్రోలు: హిందూ ముస్లింలందరూ కలిసి కట్టుగా జరుపుకునే మొహర్రం మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. మొహరం సందర్భంగా మండల కేంద్రం పెనుగంచిప్రోలుతోపాటు ముండ్లపాడు, కొణకంచి, నవాబుపేట తదితర గ్రామాల్లో పీర్లు ఊరేగింపు వైభవంగా సాగింది. భక్తులు పీర్లుకు ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సౌమ్య ప్రత్యేక ప్రార్థనలు..

నందిగామ(కంచికచర్ల) మొహర్రం పర్వదినాన్ని పురస్కరించుకుని నందిగామలోని మూడోవార్డులో పీర్ల వద్ద ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అదేవిధంగా సూఫీమత గురువు, అల్లాఫ్‌బాబా ముస్లీం మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మొహర్రం పర్వదినాన్ని ముస్లింలతోపాటు హిందూవులు కూడా జరుపుకున్నారు. ఈసందర్భంగా నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమంలో ఎమ్మెల్యే సౌమ్య, ముస్లిం మత పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

కంచికచర్ల మండలంలో...

మండలంలోని పరిటాల గ్రామంలో జెండాచెట్టు వద్ద మొహర్రం పర్వదినం సందర్భంగా ముస్లింలు పీర్లకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గ్రామంలోని ప్రజలు కులమతాలకతీతంగా మొహర్రంను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అనంతరం భక్తులకు విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆయా ముస్లింలు, రాజకీయపార్టీల నాయకులు పాల్గొన్నారు.



పెనుగంచిప్రోలులో పీర్లను ఊరేగిస్తున్న భక్తులు



చాకలిబజారు పీర్‌తో భక్తులు

ఆధునిక సేద్యం... దిగుబడులు అధికం

జగ్గయ్యపేట : నేటి ఆధునికయుగంలో ఇప్పటికీ చాలామంది రైతులు పంటలసాగుపై సరైన అవగాహన లేక పాతపద్ధతుల్లోనే సాగుచేస్తూ సరైన దిగుబడి రాక అప్పుల పాలవుతున్నారు. రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించేందుకు వ్యవసాయశాఖ అధికారులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శాస్త్రీయ పద్ధతులు పాటించడం ద్వారా రైతులు ఆయా పంటల సాగులో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయశాఖాధికారులు, శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. వేసవి దుక్కులు, విత్తనశుద్ధి, సేంద్రియ ఎరువుల వినియోగం తదితర సూచనలను పాటిస్తే పెట్టుబడులు తగ్గడంతోపాటు పంటదిగుబడులు పెరుగుతాయి. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌కు సిద్ధమవుతున్న రైతులు, వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల సూచనలను ఎప్పటికప్పుడు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంది.

వేల ఎకరాల్లో సాగు..

ప్రస్తుతం నియోజకవర్గంలో జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల్లో ఖరీఫ్ సీజన్‌లో సుమారు 75వేల ఎకరాల్లో పత్తి, మిర్చి, వరి, మొక్కజొన్న, కూరగాయల తోటలు, పూల తోటల పెంపకం చేపడుతున్నట్లు వ్యవసాయశాఖ నివేదికలు తెలుపుతున్నాయి. ఏటా వ్యవసాయ సీజన్‌లో రైతులు పంటలు వేస్తున్నప్పటికీ వారికి ఆధునిక పద్ధతులు పాటించకపోతుండటంతో పలు ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఆరుగాలం కష్టపడి పంటలను పండిస్తున్నారు.

వేసవి దుక్కులతో ప్రయోజనాలు..

పంటల సాగులో ప్రధానమైన మొదటి ప్రక్రియ వేసవి దుక్కులు. వేసవి దుక్కుల వల్ల భూమిలో పంటలకు హాని కలిగించే బ్యాక్టీరియాలు నశించి భూమి సారవంతమవుతుంది. రైతులు సాధ్యమైనంత వరకు భూమిని లోతుగా దున్నితే మంచి ఫలితం ఉంటుంది. దుక్కుల తర్వాత రైతులు పంటల దిగుబడి కోసం కచ్చితంగా భూసారపరీక్షలు నిర్వహించాలి. తద్వారా భూమిలో ఉంటే పోటాషియం, నత్రజని, భాస్వరంతోపాటు పంటల దిగుబడికి ఉపయోగపడే జింకు, మెగ్నీషియం, ఇతర సూక్ష్మధాతువులు ఏశాతంలో ఉన్నాయో తెలుసుకుని వాటికి అనుగుణంగా పంటలను సాగు చేస్తే మంచి దిగుబడులు పొందవచ్చని వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

విత్తనశుద్ధితో చీడపీడలు దూరం...

విత్తనాలను విత్తే సమయంలో శుద్ధి చేస్తే పంటలకు సాధ్యమైనంత వరకు చీడపీడలు, తెగుళ్లు పట్టవు. వ్యవసాయ అధికారుల సూచనల ప్రకారం విత్తనాలను పలు రకాల రసాయనాల మిశ్రమంతో కలిపి విత్తితే కలుపు నివారణ కూడా ఉంటుంది.

సేంద్రియ ఎరువులతో చక్కటి దిగుబడులు..

వేసవి దుక్కులు చేపట్టడానికి ముందు తర్వాత పొలాల్లో చెరువు(ఒండ్రు) మట్టి, పశువుల పేడ (ఎరువు)ను వేస్తే భూమిలో పంటలకు మేలు చేసే సూక్ష్మధాతువులు వృద్ధిచెంది అది సారవంతమవుతుంది. సేంద్రియ ఎరువుల వాడకం ద్వారా రైతులకు పెట్టుబడులు చాలా వరకు తగ్గుతాయి. రసాయన మందులను ఉపయోగించడం ద్వారా పంటల దిగుబడి, భూమి సారవంతం తగ్గించుకోవాలని రైతులు గుర్తించుకోవాలి. ముఖ్యంగా రైతులు శాస్త్రవేత్తల, వ్యవసాధికారుల సలహాలు, సూచనలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



సాగుకు సిద్ధం చేసిన భూమి

శాస్త్రవేత్తల సలహాలు పాటించాలి..



ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు ఆయా పంటలసాగుకు సంబంధించి ఆధునిక వ్యవసాయ పద్ధతులపై వ్యవసాయశాస్త్రవేత్తల సలహాలు, సూచనలు తీసుకోవాలి. ఇప్పటినుంచే ఆయా గ్రామాలకు వెళ్లి సీజన్‌లో పంటలు ఏవిధంగా సాగు చేసుకోవాలనే అంశంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ముఖ్యంగా భూసార పరీక్షల నిర్వహణతోపాటు రసాయన మందులను నియంత్రిస్తే ఆయా పంటలసాగులో అధిక దిగుబడులు సాధించవచ్చు.

– ఎస్.కృష్ణంరాజు, కృషి విజ్ఞానకేంద్రం కోఆర్డినేటర్, గరికపాడు

జీవనరాగాలు పుస్తకావిష్కరణ

నందిగామ(కంచికచర్ల): తెలుగు భాషారత్న జీవన సాఫల్య పురష్కార అవార్డు గ్రహీత తుర్లపాటి నాగభూషణరావు(నాగరాజు) రచించిన 'జీవనరాగాలు' పుస్తకాన్ని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆవిష్కరించారు. నందిగామలో బుధవారం నిర్వహించిన 'జీవనరాగాలు' పుస్తకావిష్కరణ సభలో ఎమ్మెల్యే సౌమ్య మాట్లాడుతూ తనతండ్రి, దివంగత ఎమ్మెల్యే తంగిరాల ప్రభాకరరావు సాహిత్యాభిమాని అని పేర్కొన్నారు. పుస్తకాల కొనుగోలు కోసం అధికశాతం ఖర్చుచేసేవారని గుర్తుచేసుకున్నారు. 'జీవనరాగాలు' పుస్తకాన్ని ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. తానా ప్రపంచసాహితీ సభల్లో పాల్గొన్న రచయిత నాగభూషణరావును సత్కరించుకోవడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.



పుస్తకావిష్కరణ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

శిథిలావస్థలో నందలూరు శివాలయం

నందలూరు(వీరులపాడు): మండలంలోని నందలూరులో వేంచేసియున్న భవానీ శంకరస్వామి ఆలయం శిథిలావస్థకు చేరింది. 150ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయం శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలిపోతుందోనని భక్తులు ఆందోళన చెందుతున్నారు. ఆలయానికి 22ఎకరాల భూమి ఉంది. ఆలయానికి ఆస్తులు ఉన్నప్పటికీ ఆలయ ఆలనాపాలనను దేవాదాయశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని భక్తులు విమర్శిస్తున్నారు. ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని భక్తులు పలుమార్లు అధికారులకు విజ్ఞప్తి చేసినప్పటికీ లాభం లేకపోయింది. ఇకనైనా దేవాదాయశాఖ అధికారులు స్పందించి ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.



శిథిలావస్థలో ఉన్న నందలూరు భవానీ శంకరస్వామి ఆలయం



విరిగిపోయి దర్శనమిస్తున్న ధ్వజస్తంభం

నేత్రపర్వంగా పాండురంగడి కల్యాణం

శాస్త్రోక్తంగా మూలమూర్తులకు తిరుమంజనం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం (కొత్తగుళ్ళు) ప్రాంగణంలో ఉన్న శ్రీ రుక్మాబాయి సమేత శ్రీ పాండురంగస్వామి వారి శాంతి కల్యాణోత్సవం బుధవారం నేత్రపర్వంగా జరిగింది. ఆలయంలో రెండు రోజుల నుంచి జరుగుతున్న కల్యాణ మహోత్సవాలలో భాగంగా బుధవారం తెల్లవారుజాము నుంచి పలు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉదయం స్వామి వారి మూలమూర్తులకు పంచామృత తిరుమంజనం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వివిధ ఫల, పుష్ప సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. ఆలయంలో కొలువై ఉన్న సంతాన వేణుగోపాలస్వామి వారికి కూడా తిరుమంజన కార్యక్రమాన్ని నిర్వహించారు.

సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కల్యాణ వేదికపై స్వామి వారి తిరుకల్యాణోత్సవాన్ని నిర్వహించారు. తొలుత విష్వక్సేన పూజతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మహాసంకల్పం, యజ్ఞోపవీతధారణ, మధుపర్కాల సమర్పణ, మాంగల్యధారణ, తలంబ్రాలు సమర్పణ తదితర ఘట్టాలను ఆలయ అర్చకస్వాములు పులిపాక ఆంజనేయాచార్యులు, రాఘవాచార్యులు, అద్దేపల్లి మురళీకృష్ణాచార్యులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి కల్యాణోత్సవ విశిష్టతను అర్చకస్వాములు భక్తులకు వివరించారు. పండరీపురంలో జరిగే రీతిన నగరంలో కూడా స్వామి వారి కల్యాణోత్సవం, అర్చనలను నిర్వహించడం అపూర్వమని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు, కమిటీ సభ్యులు ఉభయదాతలు పాల్గొన్నారు.





ప్రత్యేక అలంకారంలో పాండురంగడు..కల్యాణోత్సవంలో స్వామివార్లు

రేపటి నుంచి ప్రత్యేక పూజలు

పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): ఆషాఢ మాసం సందర్భంగా స్థానిక పెజ్జోనిపేటలోని శ్రీ లక్ష్మీనారాయణస్వామి దేవస్థానంలో ఈ నెల 19నుంచి మూడు రోజులపాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యదర్శి కృష్ణప్రసాద్ తెలిపారు.

దుర్గమ్మకు సారె సమర్పణ



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ మహిళా సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మకు ఆషాఢం సారెను సమర్పించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు కల్లూరి శ్రీవాణి ఆధ్వర్యంలో వివిధ జిల్లాల మహిళా సంఘాల కమిటీ ప్రతినిధులు సారె సమర్పణకు తరలివచ్చారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశ్వబ్రాహ్మణ సంఘం గౌరవ అధ్యక్షుడు, కార్పొరేషన్ మాజీ చైర్మన్ తోలేటి శ్రీకాంత్, కార్తీక సాయి దంపతులు విచ్చేశారు. తొలుత మహామండపం నుంచి ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్న అనంతరం ప్రధాన ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. మహామండపం ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తికి సారెను సమర్పించారు. అమ్మవారి దయతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, అందరికీ చేతి వృత్తులు బాగుండాలని వేడుకున్నామన్నారు. కార్యక్రమంలో సంఘం క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మేడపి ప్రసాద్, తూమాటి రమేష్, మహేశ్వరి, శశికళ, చైతన్య, జయలక్ష్మి, సునీత, రత్నకుమారి పాల్గొన్నారు.

నేత్రాల విషయంలో అప్రమత్తత అవసరం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నేత్రాల విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానం కార్యనిర్వహణాధికారి మోహనరావు సూచించారు. అయాన్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో పాతబస్తీ బ్రాహ్మణవీధిలోని శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానం ప్రాంగణంలో బుధవారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరాన్ని ప్రారంభించిన ఆలయ కార్యనిర్వహణాధికారి మోహనరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపట్ల శ్రద్ధ చూపాలన్నారు. సర్వేంద్రియానాం నయనం ప్రధానం అని, కళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శరీరానికి వ్యాయామం చాలా అవసరమన్నారు. ప్రతిరోజూ కొద్ది సేపు వ్యాయామానికి కొంత సమయాన్ని కేటాయించాలన్నారు. జీవన విధానంలో సరైన మార్పులు తీసుకుంటే చక్కని ఆరోగ్యాన్ని సొంతం చేసుకోగలరన్నారు. హాస్పిటల్స్ అధినేత డాక్టర్ బషీర్ అహ్మద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో ఆహారం, శారీరక శ్రమ తదితర అంశాలపై దృష్టి పెట్టాలన్నారు. తద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకున్నవారవుతారని చెప్పారు. కార్యక్రమంలో హాస్పిటల్స్ గౌరవాధ్యక్షుడు వావిలాల రజనీకాంతశర్మ పాల్గొన్నారు.